APTEL 2009/31957

# నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ | గురువారం | 30 జులై 2026 | సంపుటి : 17 | సంచిక : 318 | పేజీలు : 12 | వెల : 5/-



## చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ

2 లో..

## రిపోర్టర్లు కావలెను

తెలంగాణ, ఏపీ వ్యాప్తంగా 'నీలగిరి వార్త' దినపత్రి కలో పనిచేయడానికి రిపోర్టర్లు కావలెను. వివరాలకు 96765 49223 నంబర్‌లో సంప్రదించగలరు.

-ఎడిటర్



### తెలంగాణ ప్రాజెక్టులకు
## భారీ ఊరట

- పర్యావరణ అనుమతులు చెల్లుబాటు
- సుప్రీంకోర్టులో ఉపశమనం

**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీం కోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన

మిగతా 2వ పేజీలో..




# పేపర్ లీకేజీ బిల్లు పాస్!

- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాడీవేడీ చర్చ.. మూజువాణి ఓటుతో ఆమోదం
- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌గాంధీకి అవగాహన లేదన్న కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** వాడీవేడీ చర్చలు..విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ

మిగతా 2వ పేజీలో..



## వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

**న్యూఢిల్లీ :** జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు

మిగతా 2వ పేజీలో..





# పోలీస్ పోస్టులు!

- తెలంగాణ నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త
- పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు
- మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల



**హైదరాబాద్, నీలగిరివార్త :** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్

మిగతా 2వ పేజీలో..



### విద్యారంగ సమస్యలపై
## సర్కార్ నిర్లక్ష్యం

### వచ్చే అసెంబ్లీలో వీటిని ప్రస్తావిస్తా: వేముల

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

2 లో..

## పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

### ఖర్గే వ్యాఖ్యలను తిప్పికొట్టిన జెపి నడ్డా



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** దిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుబట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లాడుతూ అణచివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు

మిగతా 2వ పేజీలో..

### ఉదయ్ కృష్ణారెడ్డిపై
## ఆరోపణలు నిజమే

- తొలుత ప్రేమించుకున్న వీరు తరవాత దూరం
- అయినా వేధింపులకు దిగిన ట్రైనీ ఐపిఎస్
- నగర్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడి
- ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు పోలీసులు తరలింపు



**హైదరాబాద్, నీలగిరివార్త :** లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కేసు నేపథ్యాన్ని సీపీ సజ్జనర్ వివరించారు. నిందితుడు, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అనంతరం యూపీ ఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. 2025 డిసెంబర్ నుంచి శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకా డమిలో శిక్షణ పొందుతున్నాడు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విజయ ప్రయాణంపై నిందితుడు చేసిన పోస్టుకు ఆమె

మిగతా 2వ పేజీలో..



## హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

- పెద్దలకు అండగా హైడ్రా పనితీరు
- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘాటు విమర్శలు

హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసివేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు.

2 లో..

# పులుల సంరక్షణ మన బాధ్యత

- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
- అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి సురేఖ



**హైదరాబాద్, నీలగిరివార్త :** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్

మిగతా 2వ పేజీలో..

## దేవాదాయ శాఖలో పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ప్రతిభ చూపిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు
- పభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం
- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

2 లో..

### అత్యుత్తమ డిజిటల్
## పౌరసేవల వేదికగా మీసేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణాలు పెంచాలి
- అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, నీలగిరివార్త :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ-సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న

మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

- వారి హయాంలోనే కట్టడం, కూలడం చూశాం
- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సిగ్గుచేటు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండి పడ్డారు. బ్యారేజీలో 2..3టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడు తూ రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉప యోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో

మిగతా 2వ పేజీలో..

## సర్ ప్రక్రియలో పాల్గొనండి

### కాంగ్రెస్ బిఎల్‌ఎలకు భట్టి విక్రమార్క ఆదేశం



**న్యూఢిల్లీ, నీలగిరివార్త :** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్

మిగతా 2వ పేజీలో..

# దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

## 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి

హైదరాబాద్, నీలగిరివార్త : దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతుల మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్



చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# బ్యాక్‌లాగ్ ఉన్న వారి కోసం మరో అవకాశం

## కాకతీయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటన



హనుమకొండ, నీలగిరివార్త : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్ణీత కాలవ్యవధిలో కోర్సు పూర్తి చేయలేక బ్యాక్ లాగ్‌లు మిగిలిన యూజీ, పీజీ పూర్వ విద్యార్థులకు 2026-2027 విద్యాసంవత్సరానికి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. అర్హులైన విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్, ప్రాజెక్ట్ వర్క్, సెమినార్ పరీక్షలకు దరఖాస్తు చేసుకుని తమ కోర్సును పూర్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం రిజిస్ట్రార్ అనుమతితో పాటు నిర్దేశిత రుసుమును చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. యూజీ, పీజీ విద్యార్థులు ప్రస్తుత బ్యాచ్‌లతో కలిసి పరీక్షలు రాయవచ్చని, పీజీ విద్యార్థులు అవసరమైతే ఎస్సీఎల్ఈ పరీక్షలతో పాటు ప్రత్యేక అనుమతి పొంది నిర్ణీత రుసుం చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పూర్వవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు.

# విద్యారంగ సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

## వచ్చే అసెంబ్లీలో వీటిని ప్రస్తావిస్తా: వేముల



నిజామాబాద్, నీలగిరివార్త : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల విషయాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతా అని వెల్లడించారు. ముచ్కూర్, భీంగల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దాత దయానంద్ రెడ్డి అందించిన సుమారు 2 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను గురువారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేశారు. గురువుల ఆశీస్సులతోనే జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముచ్కూర్‌లో కాంట్రాక్టర్లు సొంత నిధులతో శ్లాబ్ పనులు పూర్తి చేయగా వాటికి సంబంధించిన సుమారు రూ.30 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.




# చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక బృందం భేటీ

అమరావతి, నీలగిరివార్త : ఏపీ సీఎం చంద్రబాబుతో తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో తైవాన్‌కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, షెంగ్ హుయ్ టెక్ తదితర అంతర్జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఎయిర్‌పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల పటిష్ఠమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్ తదితర అంశాలను తైవాన్ బృందానికి సీఎం వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వారికి తెలిపారు.

# హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

## పెద్దలకు అండగా హైడ్రా పనితీరు.. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్, నీలగిరివార్త : హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసివేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాకు అందమైన భాష్యం చెప్పి తమ ఇష్టాలకు అనుగుణంగా వాడుకుంటూ పెద్దల భూములు రక్షించుకుంటూ.. పేదల ఇండ్లు కూలగొడుతూ ఎంతో మందిని రోడ్డున పడేశారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ప్రజలను మభ్యపెట్టడం కోసమే లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కాపాడినట్లు రంగనాథ్ అబద్దాలు చెబుతున్నారని అన్నారు. దుర్గంచెరువు వద్ద ఉన్న నెక్టార్ గార్డెన్స్, ఫాతిమా కాలేజ్ లాంటి వాటి జోలికి హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని మండిపడ్డారు. హిమాయత్ సాగర్, గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇండ్ల వద్దకు హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని, కోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. రంగనాథ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద సుమోటోగా స్వీకరించాలని కోరారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడానికి హైడ్రా కూడా ఒక కారణం అన్నారు. హైడ్రాను బ్లాక్ మెయిలింగ్‌కు సాధనంగా వాడుకోవటం సబబు కాదని, సీఎం, మంత్రులు అబద్దాలు మాని పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేసీఆర్, బీఆర్ఎస్‌లను తలచుకుంటే వారికి నిద్ర పట్టడం లేదన్నారు. పాలన చేయకుండా నిత్యం కేసీఆర్‌ను తిట్టుకుంటూ ఎన్నాళ్లు పబ్బం గడుపుతారని వెల్లడించారు.

# కాళేశ్వరంపై కెటిఆర్ మాటలు సిగ్గుచేటు

మొదటిపేజీ తరువాయి..

రిహాబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

# పేపర్ లీకేజీ బిల్లు పాస్!

మొదటిపేజీ తరువాయి..

సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈబిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ బిల్లుపై మాట్లాడారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి..

ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టి వేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి..

చేయాలని కేంద్రంప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

# ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే

మొదటిపేజీ తరువాయి..

స్పందించడంతో వీరి పరిచయం ప్రారంభమైంది. తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో వీరి సంబంధం మరింత బలపడింది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయి. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వ్యక్తిగత చాట్‌లను బహిర్గతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు, సహచరులను సంప్రదించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడి నుంచి దూరంగా ఉంది. అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయినా ఉదయ్ కృష్ణారెడ్డి వేధింపులు ఆగలేదు. కేసు దర్యాప్తులో ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిందితుడిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేస్తోందని సజ్జనర్ పేర్కొన్నారు.

# పోలీస్ పోస్టులు!

మొదటిపేజీ తరువాయి..

ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య,వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# పులుల సంరక్షణ మన బాధ్యత

మొదటిపేజీ తరువాయి..

టిజిఎస్‌ఎఫ్‌ఎ డైరక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010 లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరి రక్షించడమంటే అడవిని,పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావి తరాల భవిష్యత్తును పరిరక్షించడమేనన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటిసంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972 లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో 'ప్రాజెక్ట్ టైగర్' ను ప్రారంభించి దేశ వ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ గారు పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి 'అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెలంగాణను అందించాలి' అని మంత్రి దిశా నిర్దేశర చేశారు. అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని మంత్రి సురేఖ అందించారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

# పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

మొదటిపేజీ తరువాయి..

పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు.

# అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీసేవ

మొదటిపేజీ తరువాయి..

వివిధ కార్యక్రమాలు, ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

# సర్ ప్రక్రియలో పాల్గొనండి

మొదటిపేజీ తరువాయి..

కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి సర్ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు.

printed, Published and Owned by GUNTOJU VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No : 08, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl), Rangareddy(dist). Telangana. Published at V.M.PUB-LICATIONS Plot No : 108, Shiva shankar colony, Kuntloor( vil), Abdulpurmet(mdl),Telangana State. Pin : 501505, Editor : GUNTOJU VISHNU MURTHY, RNI No : APTEL/31957/2009. Cell No : 96765 49223.

# మానవతా దృక్పథంతో సింగరేణి ఆలోచించాలి..

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**



2025--26 ఆర్థిక సంవత్సరం లాభాల పై శ్వేతపత్రం విడుదల చేయాలని, గుర్తించిన నూతన బొగ్గు బ్లాక్ లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని హెచ్.ఏం.ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ వేదికగా బుధవారం నిర్వహించిన సమావేశంలో హెచ్.ఏం.ఎస్ యూనియన్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి సాజన్ మాట్లాడారు. హెచ్.ఎం.ఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమంలో ఇచ్చిన నిరవధిక నిరాహార దీక్ష కారణంగానే సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించిందని సాజన్ అన్నారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల విషయంలో యాజమాన్యం మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాశీపేట ఒకటవ గనికి చెందిన వెంకటేశ్వర్లు అనే కార్మికుడు తన కాలును పూర్తిగా కోల్పోయినప్పటికీ ఫిట్‌గా ప్రకటించి, భూగర్భ విధుల నుండి సర్ఫేస్ విధులు నిర్వహించాలని సూచించడం ఏమిటని ప్రశ్నించారు. తీవ్ర శారీరక వైకల్యం ఉన్న కార్మికుడి పరిస్థితిని సింగరేణి సంస్థ మానవతా కోణంలో మరోసారి పరిశీలించాలని ఆయన కోరారు. సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని వాస్తవికంగా, నిష్పక్షపాతంగా పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభనష్టాల పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సాజన్ డిమాండ్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 65 మిలియన్ టన్నుల డిస్పాచ్‌తో సింగరేణి సంస్థకు 6,000 కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతలో గణనీయమైన కార్మికులు పనితీరుతో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాల వివరాలను యాజమాన్యం కార్మికుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు అందించిన విషయాన్ని గుర్తు చేసిన. ఈ ఏడాది కూడా కార్మికుల వలన పెరిగిన ఉత్పాదకతను, శ్రమను పరిగణనలోకి తీసుకుని గతం కంటే తక్కువ కాకుండా మరింత మెరుగైన లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మణుగూరు పి.కే.ఓ.సి 2 డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణికి కేటాయించాలని కోరుతున్న సమయంలో వేలం నిర్వహించడం అన్యాయం అన్నారు. అంతేకాకుండా, ఈ వేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జెన్ కో సంస్థ పాల్గొనడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన సింగరేణి సంస్థకు పోటీగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని మరో సంస్థ వేలంలో పాల్గొనే పరిస్థితి రావడం సరైన విధానం కాదన్నారు. జెన్ కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సుదర్శన్, నాగనవేణి హరీష్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, నీరటి కార్తీక్, హర్షవర్ధన్, గౌతం, శ్రావణ్, జబీర్, శ్రావణ్, ప్రీత్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపూజ్యోత్సవం..

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి**



: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో బుధవారం గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా ఎండో మెంట్ సెల్ జిల్లా కో కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో మండలంలో దుబ్బపల్లి సత్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గురువులు ఊట్ల వెంకట శాస్త్రి, మిట్టపల్లి సత్యనారాయణ శాస్త్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు దీక్షితులకు గురు వందనం చేసి గురు పూజోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ దరవేని రవికుమార్, మిట్టపల్లి ప్రదీప్, ఎలగందుల సత్యం, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సెలింగ్..

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి**



: మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా సి.ఈ.ఆర్ క్లబ్ వేదికగా బుధవారం ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్స్ కేటాయింపు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏరియాలో 88 క్వార్టర్లు అందుబాటులో ఉండగా 80 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకమైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి 14 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎస్.ఓ.టు.జిఎం జీ.ఎల్ ప్రసాద్, డి.వై.పి.ఏం విజయ్ సందీప్, సీనియర్ పర్సనల్ అధికారి కార్తీక్, కే.శ్యాం కుమార్, మేనేజ్మెంట్ ట్రైనీ సివిల్ ఆర్.వీణ, పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**దశలవారీగా ప్రతీ కుటుంబానికి మంజూరు**

**రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం**

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**

**ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి జులై 29 :**



ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం--డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నాలుగు విడతల్లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సాధికారతే ధ్యేయం**

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్‌డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నాయకుల తీర్మానం.

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి**



మందమర్రి ఆటో యూనియన్ పట్టణ అధ్యక్ష పదవి కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో బుధవారం మెన్ కమిటీ చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆటో యూనియన్ మందమర్రి పట్టణ కమిటీ కాలపరిమితి ముగిసిందని హాజరైన 11 మెన్ కమిటీ సభ్యుల ఏక తీర్మానంతో ప్రకటించారు. ఆటో యూనియన్ ఎన్నికలు నిర్వహించే వరకు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసమై పూర్తి బాధ్యత మెన్ కమిటీ సభ్యులకు, ఆపద్ధర్మ అధ్యక్షులు మొయ్య రాంబాబుకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే పూర్తి బాధ్యత లెవెన్ మెన్ కమిటీకి మాత్రమే ఉంటుందని తీర్మానం చేసినట్లు తెలిపారు. బేసజాలకు పోకుండా ఆటో కార్మికుల ఐక్యత కోసం హక్కుల సాధన కోసం విభేదాలు లేకుండా అందరు కలిసి పని చేయాలని అందరం ఐక్యంగా ఉంటే ఎంత పెద్ద సమస్య వచ్చిన పరిష్కరించుకోవచ్చు అని అన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, రెడ్డి సతీష్, సూరం శ్రీనివాస్, బుక్కల సంతోష్, పంబాల శ్రీనివాస్, మాదాసు లింగమూర్తి, చొప్పరి లచ్చన్న, బొల్లం రమేష్, బొట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భరోసాకు అండగా ఎమ్మెల్యే జారె:...

**బాధిత కుటుంబాలకు చేయూత నేను విన్నాను నేను ఉన్నాను అంటూ భరోసా**

**అన్నపురెడ్డిపల్లి, జులై 29 నిలగిరి వార్త న్యూస్**



ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే ప్రజాప్రతినిధి బాధ్యత అనే నమ్మకంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తూ వారికి భరోసాగా నిలుస్తున్నారు,ఈ సందర్భంగా నేడు హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన 278 మంది అనారోగ్య బాధితుల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం ఆర్ ఎఫ్)దరఖాస్తులను సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు,అలాగే అన్నపురెడ్డిపల్లి మండలం జానకిపురం గ్రామానికి చెందిన కట్ట రవి గుండె శస్త్రచికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ ( ఎల్ ఓ సి) ను ఎమ్మెల్యే జారె స్వయంగా నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి అందజేశారు,దీంతో బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గి, ఆర్థికంగా ఊరట లభించింది,

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ,పేద ప్రజలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులందరికీ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు, ప్రజల కష్టసుఖాలు తనకు ప్రత్యక్షంగా తెలుసని, ప్రజాసేవే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని పేర్కొన్నారు,పదవులు శాశ్వతం కావని,కానీ ప్రజలకు చేసిన సేవ మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నరు,ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి కుటుంబ సభ్యుడిలా అండగా నిలుస్తానని భరోసా వ్యక్తం చేశారు......

# ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం



**పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఎన్ఎస్పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**

**ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి జూలై 29:**



జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



# హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును అందచేసిన సిపి.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

ఆకస్మికంగా మరణించిన హోంగార్డ్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ చేతుల మీదుగా ఐదు లక్షల ఆర్థిక సాయం చెక్కును బుధవారం సీపీ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సహాయ సహకారాలను అందిస్తున్న హోంగార్డ్స్ ఆకస్మికంగా గాని లేదా ప్రమాదాల్లో మరణిస్తే సిబ్బంది కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని, మరణించిన హోంగార్డ్స్ కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాలని రాష్ట్ర పోలీస్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా దుగ్గొండి పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆకస్మికంగా మరణించిన పి. శ్రీనివాస్ రెడ్డి భార్యకు పోలీస్ కమిషనర్ ఆర్థిక చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ అదనపు డీసీపీ శ్రీనివాస్, హోంగార్డ్స్ ఆర్ ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు

# వరుణ యాగం హోమం కార్యక్రమంలో పాల్గొన్న.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**



బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం యందు నిర్వహించిన హిరణ్య ఋష్య శృంగావాహన వరుణయాగ మహోత్సవం కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఎల్ నినో నేపథ్యంలో సకాలంలో వర్షాలు కురియాలని,రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.

# నకారా స్ఫూర్తితో పెన్షనర్లంతా ఐక్యంగా ఉద్యమించాలి

**ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి జూలై 29:**




దివంగత ధర్మసూద్ నకారా ఉద్యమ స్ఫూర్తితో నేటి పెన్షనర్లు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు పిలుపునిచ్చారు. ధర్మసూద్ నకారా వర్ధంతి సందర్భంగా మంగళవారం ఖమ్మంలోని పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నకారా సాధించి పెట్టిన పెన్షన్ హక్కులను నేటి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, పెన్షనర్లను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, మార్గదర్శకాలు విడుదల చేయకుండా, ఆసుపత్రుల జాబితా ప్రకటించకుండా, వెబ్‌సైట్‌ను సక్రమంగా నిర్వహించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండు నెలలుగా పెన్షన్ నుంచి ప్రీమియం మినహాయించినప్పటికీ ఇప్పటివరకు ఆరోగ్య కార్డులు అందించకపోవడం బాధాకరమన్నారు. అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య సేవలు అమలు కాకపోవడంతో పలువురు పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్లందరూ ఐక్యంగా ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. పూర్ణచంద్రరావు, జిల్లా కార్యదర్శి టి. జనార్దన్, నగర శాఖ నాయకులు ఎస్. సత్యనారాయణ, రమణ యాదవ్, వెంకటేశ్వర్లు, ఎం. శంకరరావు, సీహెచ్. రాంబాబు, రామస్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తొలుత 175 పరుగులు, ఆ తర్వాత 9 వికెట్లు..



: శ్రీలంకతో జరగనున్న టెస్ట్ సిరీస్‌తో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మళ్లీ మైదానంలోకి అడుగుపెడుతున్నాడు. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టులో అతడు చేరడం అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నింపుతోంది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం ఇదే లంక జట్టుపై మొహాలీ వేదికగా జడేజా సృష్టించిన ఆల్ రౌండ్ విధ్వంసకాండ ఇప్పటికీ క్రీడాభిమానుల కళ్లముందే మెదులుతోంది.

బ్యాట్‌తో సునామీ.. లంక బౌలర్లకు చుక్కలు..
2022లో శ్రీలంకతో మొహాలీలో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు ఒక దశలో 228 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అప్పుడే క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా.. రిషబ్ పంత్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పంత్ తనదైన శైలిలో చెలరేగగా, జడ్డూ అతనికి అద్భుతమైన సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి 104 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నిర్మించారు. పంత్ అవుటైన తర్వాత జడేజా గేర్ మార్చాడు. టెస్ట్ మ్యాచ్‌ను కాస్తా టీ20లా మార్చేశాడు. శ్రీలంక బౌలర్లను ఊచకోత కోస్తూ కేవలం 160 బంతుల్లోనే అద్భుతమైన సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా విరుచుకుపడి 175 పరుగులతో అజేయంగా నిలిచాడు. జడ్డూ దెబ్బకు లంక బౌలర్లకు ఏం చేయాలో పాలుపోలేదు.

## రోజుకు కేవలం రూ.45 పొదుపుతో రూ.25 లక్షల రిటర్న్స్.. జీవితాంతం ఉచిత బీమా!




: భారతీయ జీవిత బీమా సంస్థ (ానxజ) దశాబ్దాలుగా కోట్ల మంది భారతీయులకు నమ్మకమైన పెట్టుబడి మార్గంగా ఉంది. నేటి కాలంలో మార్కెట్లో ఎన్ని పెట్టుబడి ఆప్షన్ ఉన్నప్పటికీ, సామాన్యులు తమ డబ్బు సురక్షితంగా ఉంటూనే, భారీ లాభాలను అందించే పథకాల కోసం వెతుకుతుంటారు. అలాంటి వారి కోసం ఎల్ఐసి అందిస్తున్న అద్భుతమైన పథకమే 'న్యూ జీవన్ ఆనంద్' పాలసీ అందుబాటులో ఉంది. ఈ పాలసీ కేవలం పొదుపు మార్గం మాత్రమే కాదు, మీ కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చే ఒక బలమైన కవచం. తక్కువ ప్రీమియంతో దీర్ఘకాలంలో పెద్ద మొత్తాన్ని పొందాలనుకునే వారికి ఇది సరైన ఎంపిక. చిన్న మొత్తంతో భారీ నిధి:
చాలామంది ఒక పెద్ద మొత్తాన్ని కూడబెట్టాలంటే నెలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టాలని అనుకుంటారు. కానీ, జీవన్ ఆనంద్ పాలసీ ఆ నమ్మకాన్ని మారుస్తుంది. ఈ లెక్కను ఒకసారి గమనించండి.
పాలసీ కాలపరిమితి: 35 ఏళ్లు. వార్షిక ప్రీమియం: సుమారు రూ. 16,300.
నెలవారీ పొదుపు: రూ. 1,359 (అంటే రోజుకు కేవలం రూ.45 మాత్రమే). ఈ 35 ఏళ్ల కాలంలో మీరు మొత్తం రూ. 5.70 లక్షలు జమ చేస్తారు. కానీ మెచ్యూరిటీ సమయంలో మీకు లభించే మొత్తం అక్షరాలా రూ.25 లక్షలు. ఇందులో రూ.5 లక్షల మూల బీమా మొత్తం రూ. 8.60 లక్షల రివిజనరీ బోనస్, రూ. 11.50 లక్షల ఫైనల్ అడిషనల్ బోనస్ కలిసి ఉంటాయి. మెచ్యూరిటీ తర్వాత కూడా ఉచిత బీమా! ఈ పాలసీలోని అత్యంత ప్రత్యేకమైన ఫీచర్ 'హోల్ లైఫ్ రిస్క్ కవర్'. సాధారణ బీమా పాలసీల్లో మెచ్యూరిటీ సమయం ముగిసి డబ్బులు తిరిగి రాగానే బీమా రక్షణ కూడా ముగిసిపోతుంది. కానీ జీవన్ ఆనంద్‌లో అలా కాదు. 35 ఏళ్ల తర్వాత మీరు రూ.25 లక్షల మెచ్యూరిటీ సొమ్ము తీసుకున్నప్పటికీ, మీ రూ. 5 లక్షల ఉచిత బీమా జీవితాంతం కొనసాగుతుంది. పాలసీదారుడు ఎప్పుడు మరణించినా (వయస్సుతో సంబంధం లేకుండా), వారి కుటుంబానికి లేదా నామినీకి ఆ రూ. 5 లక్షల అదనపు మొత్తం అందుతుంది.
పన్ను ప్రయోజనాలు, లోన్ సౌకర్యం:
ఆర్థిక భద్రతతో పాటు, ఈ పథకం పన్ను ఆదా చేయడంలో కూడా ఎంతో సహాయపడుతుంది: సెక్షన్ 80జ: మీరు చెల్లించే ప్రీమియంపై ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చు. సెక్షన్ 10(10ణ): మెచ్యూరిటీ సమయంలో వచ్చే మొత్తం, మరణానంతరం లభించే ప్రయోజనాలు పూర్తిగా పన్ను రహితం.
లోన్ సౌకర్యం: పాలసీ తీసుకున్న రెండు సంవత్సరాల తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మీ డిపాజిట్ పై లోన్ పొందే అవకాశం ఉంది.
ఎవరు తీసుకోవచ్చు? వయోపరిమితి: 18 నుండి 50 సంవత్సరాల మధ్య ఉన్న భారతీయులెవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు. టర్మ్: 15 నుండి 35 ఏళ్ల వరకు మీకు నచ్చిన కాలపరిమితిని ఎంచుకోవచ్చు. వు రక్షణ: అవసరమైతే యాక్సిడెంటల్ డెత్, ఇతర రైడర్లను కూడా జోడించుకోవచ్చు.

## రోకో 2027 వరల్డ్ కప్ ఆడతారా? పాకిస్తాన్ మాజీ కెప్టెన్ కీలక వ్యాఖ్యలు

భారత క్రికెట్ జట్టులోని ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడతారా లేదా అనే అంశంపై క్రికెట్ వర్గాల్లో నిరంతరం చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ మాజీ కెప్టెన్, ఆసియా బ్రాడ్‌మన్‌గా పేరొందిన జహీర్ అబ్బాస్ ఈ ఇద్దరు స్టార్ బ్యాటర్లకు తన పూర్తి మద్దతు తెలిపారు. రోహిత్, విరాట్‌లలో ఇప్పటికీ అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శన చేసే సత్తా ఉందని, వారు ఫిట్‌గా ఉంటే రాబోయే వన్డే ప్రపంచకప్‌లో తప్పకుండా ఆడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
వయసు కాదు.. ఫిట్‌నెస్, ప్రదర్శనే ముఖ్యం
ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడిన జహీర్ అబ్బాస్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్ ఆటగాళ్లను కేవలం వయసును బట్టి జట్టుకు దూరం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఆటగాడు ఫిట్‌గా ఉండి, మ్యాచ్‌ల్లో నిలకడగా పరుగులు సాధిస్తున్నంత కాలం జట్టులో అతని స్థానానికి ఎలాంటి డోకా ఉండదని చెప్పారు. విరాట్, రోహిత్ ఇద్దరూ ప్రపంచ క్రికెట్‌లోనే అత్యుత్తమ బ్యాటర్లని, బిగ్ టోర్నమెంట్లలో వారి అనుభవం భారత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.
విరాట్ ఫిట్‌నెస్‌పై ప్రశంసలు.. రోహిత్‌కు చిన్న సలహావిరాట్ కోహ్లీ శారీరక దృఢత్వంపై జహీర్ అబ్బాస్ ప్రశంసల వర్షం కురిపించారు. కోహ్లీ ఇప్పటికీ అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ఉన్నాడని, అతను ఇప్పట్లో క్రికెట్‌కు దూరమయ్యే ప్రసక్తే లేదని, చాలా కాలం పాటు ఆడగలడని కొనియాడారు. ఇక రోహిత్ శర్మ గురించి



మాట్లాడుతూ.. రోహిత్ బ్యాటింగ్ క్లాస్ ఇప్పటికీ అత్యుత్తమంగా ఉందన్న ఆయన, కాకపోతే తన ఫిట్‌నెస్‌పై కాస్త ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉందని సలహా ఇచ్చారు. ఫిట్‌నెస్ సరిగ్గా ఉంటే రోహిత్ కూడా 2027 వరల్డ్ కప్ వరకు సులువుగా ఆడగలడని ధీమా వ్యక్తం చేశారు.
బిగ్ టోర్నీల్లో భారత్‌కు అనుభవమే ఆయుధం
2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ల ప్రాతినిధ్యం చాలా కీలకమని జహీర్ అబ్బాస్ అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నమెంట్లలో ఒత్తిడిని జయించే అనుభవం వారి సొంతమని, అది జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఇప్పటికీ ఇద్దరిలో ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించే సామర్థ్యం ఉందని, ఇలాంటి ఆటగాళ్లే ఏ జట్టుకైనా అసలైన బలమని కొనియాడారు.

రోహిత్ బ్యాటింగ్ టైమింగ్‌కు ఫిద
రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిపై ప్రత్యేకంగా మాట్లాడిన జహీర్ అబ్బాస్, ఇటీవల ఇంగ్లాండ్‌పై రోహిత్ సాధించిన సెంచరీని చూడటం ఎంతో ముచ్చటగా అనిపించిందని గుర్తు చేసుకున్నారు. రోహిత్ క్రీజులో బాదే షాట్లు, అతని టైమింగ్ ఎంతో సహజంగా ఉంటాయని, అతడి బ్యాటింగ్‌ను వీక్షించడం ఎప్పుడూ ఒక అద్భుతమైన అనుభూతినిస్తుందని చెప్పారు. కాగా, సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న 2027 వన్డే వరల్డ్ కప్‌పై ఇప్పటినుంచే అంచనాలు మొదలవ్వగా, జహీర్ అబ్బాస్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## గృహ బీమా తీసుకోవడం మంచిదేనా..? ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి..?



చాలామంది తమ సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు డబ్బులు పొదుపు చేసుకుంటూ ఉంటారు. తమ కష్టార్జితం మొత్తాన్ని కూడబెట్టుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అయ్యే మెటీరియల్ ఖర్చులు పెరుగుతున్న క్రమంలో సొంతిల్లు నిర్మాణానికి అదనపు ఖర్చు అవుతుంది. దీంతో పొదుపు చేసుకున్న డబ్బులు సరిపోకపోవడం వల్ల బ్యాంకుల నుంచి హోమ్ లోన్లు తీసుకుంటున్నారు. హోమ్ లోన్లకు వడ్డీ రేటు చాలా తక్కువగా ఉంటుంది. దీంతో చాలామంది ఈ లోన్లను తీసుకుంటూ ఉంటారు. అయితే హోమ్ లోన్ తీసుకున్నప్పుడు ఇంటికి బీమా తీసుకోవడం అవసరమా.. లేదా అనే విషయాలు తెలుసుకుందాం. హోమ్ ఇన్సూరెన్స్ ఎలా పనిచేసుంది..? గృహ బీమా అనేది చాలా ఉపయోగపడుతుంది. రుణ గ్రహీతకు ఏదైనా లపడకుండా ఇది కాపాడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన రుణాన్ని బీమా సంస్థ బ్యాంకులకు చెల్లిస్తుంది. దీని వల్ల ఈఎంఐ చెల్లించే చింతను తొలగిస్తుంది. లోన్ తీసుకున్న వ్యక్తి చనిపోతే బీమా సంస్థ మిగిలిన హోమ్ భూకంపాలు లాంటి ప్రమాదాల వల్ల మీ ఇంటికి హాని జరిగితే బీమా వర్తిస్తుంది. ఎప్పుడు తీసుకోవాలి..? రుణ తీసుకున్న వ్యక్తి పేరుపై ఎలాంటి లైఫ్ ఇన్సూరెన్స్ లేని సమయంలో గృహ బీమా అనేది తీసుకోవాలి. ఒకవేళ రుణం పొందిన వ్యక్తికి జీవిత బీమా ఉంటే హోమ్ ఇన్సూరెన్స్ అనేది ముఖ్యం కాదు. ఇక మీ కుటుంబాన్ని మీరు ఒక్కరే పోషిస్తుంటే గృహ బీమా అనేది తీసుకోవాలి. ఇక గృహ బీమా ప్రీమియం విషయానికొస్తే.. ప్రీమియంను ఒకేసారి చెల్లిస్తారు. ఒక్కోసారి వార్షికంగా చెల్లిస్తారు. కొన్నిసార్లు బ్యాంకులు దీనిని గృహ రుణానికి జోడించి ఈఎంఐతో పాటు క్రమంగా చెల్లించేలా చేస్తాయి.

## క్రిస్ గేల్‌ను కూడా దాటేసిన వైభవ్ సూర్యవంశీ..

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇటీవల ముగిసిన జింబాబ్వే పర్యటనలో తన అద్భుత బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. 3 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన వైభవ్ 3 ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 151 పరుగులు సాధించాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనకు గాను ఆయనకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. ఈ సిరీస్‌తో వైభవ్ తన కెరీర్‌లో 40 టి20 మ్యాచ్‌ల మార్కును చేరుకున్నాడు. ఈ తొలి 40 మ్యాచ్‌ల ప్రదర్శనను యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ గణాంకాలతో పోల్చి చూస్తే భారత కుర్రాడు చాలా ముందంజలో ఉన్నాడు.
40 టీ20ల తర్వాత: వైభవ్ జం క్రిస్ గేల్తొలి 40 టీ20 ఇన్నింగ్స్‌ల తర్వాత క్రిస్ గేల్ సాధించిన గణాంకాలతో పోలిస్తే వైభవ్ సూర్యవంశీ అన్ని విభాగాల్లోనూ అగ్రస్థానంలో నిలిచాడు. తొలి 40 ఇన్నింగ్స్‌ల్లో గేల్ 1189 పరుగులు చేయగా, వైభవ్ ఏకంగా 1670 పరుగులు చేశాడు. అంటే గేల్ కంటే 481 పరుగులు ఎక్కువ సాధించాడు. సగటు విషయంలో గేల్ 33.97 నమోదు చేయగా, వైభవ్ 42.82తో సత్తా చాటాడు. ఇక స్ట్రైక్ రేట్ పరంగా గేల్ 137.29తో ఉంటే, వైభవ్ ఏకంగా 216.32 భారీ స్ట్రైక్ రేట్‌తో విధ్వంసం సృష్టించాడు. సెంచరీల విషయంలో గేల్ 1 సెంచరీ చేయగా వైభవ్ 4 సెంచరీలు చేశాడు. అలాగే హాఫ్ సెంచరీలలో కూడా గేల్ (7)





కంటే వైభవ్ (8) ముందున్నాడు. చిన్న వయసులోనే ఐపీఎల్, ఇంటర్నేషనల్ డెబ్యూకేవలం 14 ఏళ్ల చిన్న వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఖ్రూా) ఆడే అవకాశం దక్కించుకున్న వైభవ్ సూర్యవంశీ, లీగ్‌లో పవర్‌ఫుల్ ప్రదర్శనతో టీమిండియాలోకి అడుగుపెట్టాడు. 15 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు తన అంతర్జాతీయ కెరీర్‌లో 6 టీ20 మ్యాచ్‌లు ఆడిన వైభవ్, 32.16 సగటు, 189.21 స్ట్రైక్ రేట్‌తో 193 పరుగులు చేశాడు. ఇందులో 2 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో పరుగుల వరదఅంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు డొమెస్టిక్ క్రికెట్‌లోనూ వైభవ్ మెరుపులు మెరిపిస్తున్నాడు. ఇప్పటివరకు 8 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, 13 లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడిన వైభవ్, రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్‌లో గత రెండేళ్లుగా కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటివరకు 23 ఐపీఎల్ ా ఆడిన ఈ యువ క్రికెటర్ 2026 ఐపీఎల్ సీజన్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ సాధించడం విశేషం

## శ్రీ షిరిడి సాయిబాబా జ్ఞాన సరస్వతి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు

దేవరకొండ నీలగిరి వార్త



దేవరకొండ పట్టణంలోని శ్రీ శిరిడి సాయిబాబా శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఉదయం తెల్లవారుజామునే బాబా జ్ఞాన సరస్వతి దేవి లకు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు అనంతరం నీలపాండరాయ్య శిష్య బృందంచే గీతా పారాయణాన్ని నిర్వహించారు అనంతరం బాబా గురువు వినిపించగా భక్తులు భజనలు కీర్తనలతో దేవాలయం మారుమోగింది వందలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఇల్లందుల శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి దొడ్డి సుధాకర్ ,కోశాధికారి కర్నాటి జనార్దన్, పానుగంటి మల్లయ్య, ఆలంపల్లి నరసింహ,పున్న వెంకటేశ్వర్లు, దొడ్డి వెంకటేశ్వర్లు, నామ దామోదర్ ,చిలువేరు చంద్రమౌళి ,మోహనయ్య కర్నాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## భూ వ్యాపారాల బాగోతానికి ప్రజలు బలి..

నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి



: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారికి అంటిపెట్టుకుని ఉన్న గిరిజన భూమిలో వెలసిన నూతన నిర్మాణాల్లో కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ వరద నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవాపూర్ రైల్వే లైన్ నుండి మొదలు కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్ళే మార్గం, డైమండ్ మోటార్స్, ఇందు గార్డెన్, నార్లపూర్ స్టేజ్ వరకు పూర్తిగా నీరు నిలిచిపోయింది. సమస్యలు తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు హుటాహుటిన అక్కడికి చేరుకుని రెండు జేసిబి వాహనాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. గిరిజన భూముల్లో వాలిన రాబందులు భూ వ్యాపారంతో కోట్ల రూపాయలు దోచుకున్న కేటుగాళ్ల కారణంగా భూములు కొనుగోలు చేసి నిర్మాణాలు చేసుకున్న వారికి అవసరమైన మేరకు డ్రైన్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. బాధ్యతగల ఓ ప్రభుత్వ ఉద్యోగి అక్రమ నిర్మాణాలు చేసి అమాయకులకు అంటగట్టి అందినకాడికి దండుకుని బాధ్యత గల ఉద్యోగానికి కళంకము తెచ్చినట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర వర్షాలు కురుస్తున్న లెక్కచేయకుండా వ్యాపారాలు, ప్రజల సమస్యలను పరిష్కరించిన మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 72 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన ఎ.జె. మిల్స్ కాలనీ పోలీసులు.

## నలుగురు నిందితులు అరెస్ట్.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు కేవలం 72 గంటల్లోనే ఛేదించి, ఈ కేసులో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుండి పోలీసులు హత్యకు ఉపయోగించిన కత్తి, నేరానికి వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రక్తపు మరకలతో ఉన్న దుస్తులు,నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.లి

అరెస్టయిన నిందితుల వివరాలు 1: గిరబోయిన మహేందర్ అలియాస్ మహి (28), టిప్పర్ డ్రైవర్, బి.ఆర్. నగర్, వరంగల్. (రౌడీ షీటర్/సస్పెక్ట్ షీటర్)2: కంప రాజేష్ (35), స్క్రాప్ వ్యాపారి, ఎస్.ఆర్.ఆర్. తోట, వరంగల్.3: భూక్య పూర్ణచందర్ అలియాస్ పున్ను (24), డెకరేషన్ వర్కర్, బి.ఆర్. నగర్, వరంగల్.

4: కొండపాక కమలేష్ (19), విద్యార్థి, రాజీవ్ కాలనీ, కరీమాబాద్, వరంగల్.

ఈ అరెస్ట్ కు సంబందించి మీల్స్ కాలనీ ఇన్స్ స్పెక్టర్ కర్రె స్వామి వివరాలు వెల్లడిస్తూ 2026 జూలై 25వ తేదీ సాయంత్రం సుమారు 5.12 గంటల సమయంలో, ఖిలా వరంగల్‌లోని బి.ఆర్. నగర్‌కు చెందిన మాధ అనిల్ (23) అనే యువకుడిపై ఉర్సుగుట్టలో అకుతోట ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సీపీఎం కార్యాలయం సమీపంలో ప్రధాన నిందితుడు గిరబోయిన మహేందర్ తన సహచరులతో కలిసి పదునైన ఫోల్డింగ్ కత్తితో దాడి చేశాడు. అనంతరం గొంతు కోసి, ఛాతిపై తీవ్రంగా పొడవడంతో అనిల్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

మృతుడి సోదరుడు మాధ సాంబరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎ.జె. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 505/2026, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 103(1) చదవవలసిన 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**హత్యకు గల కారణం**

పోలీసుల దర్యాప్తులో పాత కక్షలే ఈ హత్యకు కారణమని తేలింది. 2023లో జరిగిన వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డీజే ఏర్పాటు విషయంలో మృతుడు అనిల్‌కు, ప్రధాన నిందితుడు మహేందర్‌కు మధ్య వివాదం చోటుచేసుకుంది. అనంతరం 2023 డిసెంబర్ 31న జరిగిన ఘర్షణలో అనిల్, అతని సహచరులు మహేందర్‌పై దాడి చేయగా, ఆ ఘటనపై ఎ.జె. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 02/2024 నమోదు అయింది.ఆ ఘటనను మనసులో పెట్టుకున్న మహేందర్, బీరన్న బోనాల సందర్భంగా అనిల్ స్వగ్రామానికి వచ్చిన విషయం తెలుసుకొని, అతడిని హత్య చేయడానికి పథకం రచించి తన సహచరులతో కలిసి ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.

2026 జూలై 28వ తేదీన ఆర్టీఏ జంక్షన్ వద్ద పోలీసులు సాధారణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వెళ్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించారు. వారు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వెంబడించి మధ్యాహ్నం సుమారు 1.00 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో పోలీసులను నలుగురు నిందితులను

అరెస్టు చేసి నిందితులను రిమాండ్ కు తరలించారు.

ఈ సందర్భంగా మిల్స్ కాలనీ మాట్లాడుతూ

హింస, రౌడీయిజం, గ్యాంగ్ వైరం వంటి సంఘవ్యతిరేక కార్యకలాపాల పట్ల వరంగల్ పోలీస్ కమిషనరేట్ జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయబడుతుంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారు, హింసాత్మక చర్యలకు పాల్పడే వారు, అక్రమ ఆయుధాలు కలిగి ఉన్న వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. అలవాటు నేరస్థులపై రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు నవీకరించడంతో పాటు అవసరమైతే ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద కూడా చర్యలు తీసుకోబడతాయని ఇన్స్ స్పెక్టర్ తెలిపారు.

# నర్సంపేట వికాస తరంగిణి శాఖ వారి ఆధ్వర్యంలో.

## శ్రీ రామ హృదయ కళశాల శోభాయాత్ర.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

బుధవారం రోజున స్థానిక నర్సంపేట 13 వ వార్డు శ్రీ రామాలయంలో సాయంత్రం గురు పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు ఐనా శ్రీ రామ హృదయ కళశ స్పర్శ శోభాయాత్ర ఘనంగా 13 వ వార్డు నర్సంపేట శ్రీ. రామాలయంలో ప్రథమంగ ప్రారంభమైంది.. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి మంగళషాషనాలాతో జగదాచార్య చిన జీయర్ స్వామి వారి తిరునక్షత్రోత్సవ శుభ సందర్భంగా శ్రీ రామ హృదయం కళశ శోభాయాత్ర వికాస తరంగిణి నర్సంపేట శాఖ సభ్యులు ఇంటింటా గ్రామాల్లోని గృహస్థులు ఆలయ దర్శనం చేసుకొని అక్కడ ఉన్న శ్రీ రామ హృదయ కలశం అందరూ పిడికెడు బియ్యం గింజలు వెయ్యాలని శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ చేతులతో స్పర్శించి హృదయానికి తకాలని శ్రీ విష్ణు పారాయణం చేయాలని వికాస తరంగిణి బాద్యులు శ్రీ జగదాచార్య చిన జీయర్ స్వామి వారి అభీసిష్టం అని వరుసగా తొంబై రోజులు ప్రతి ఇంట్ల ఆధ్యాత్మలు సస్తంగ్ జరుగుతాయని ఆ కమిటీ బాధ్యులు ఎంవీ. కృష్ణ రావు, వెంశెట్టి. శ్రీనివాస్, సట్ల. వీరయ్య, మెరుగుజు. రేణుక, కోట.కల్పన, శారద త్రివేణి, ఆర్ ఎన్ స్వామి, సంధ్య ఆలయ అర్చక స్వామి నాగరాజు. కాందూరి. గార రామానుజ చార్య, తదితరులు బాధ్యతలు తీసుకుకోని కార్యక్రమాలు సుసంపన్నం చేశారు, మున్ముందు మధ్యాహ్నం నర్సంపేట కోర్ట్ వెనక గలరు శ్రీ దుర్గా మాతా దేవాలయంలో కూడా మహా అన్నధానం నిర్వహించి శ్రీ రామ హృదయ కళశాల్లో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బియ్యం సమర్పించారు, ఈ మొదటి రోజు కార్యకర్తలు వికాస తరంగిణి, అర్చక స్వాములు ఆలయ కమిటీ బాధ్యులు భక్తుల కమిటీ మెంబెర్స్ అధిక సంఖ్యలో పాల్గొని కార్యకర్తలు విజయ వంతం చేశారు వికాస తరంగిణి ప్రతినిధి సమన్వయ కర్త దాస్యం. రంగనాధ స్వామి 29 నుండి 12 వరకు 15 నుండి 25 ఆలయాలు నర్సంపేట, దుగ్గొండి, చెన్నారావుపేట, ఖానాపూర్, నల్లబెల్లి మండలాల్లోని గ్రామాల ఆలయాలు శ్రీ రామ హృదయ కళశాన్ని శోభాయాత్ర గా చేసి సందర్శించి భజన, కోలాటాలు, సంకీర్తన మండలి వారు, శ్రీవైష్ణ వ సంస్థల ఇతర దైవ సంబంధిత వారి ఆధ్వర్యంలో 15 రోజులు అట్లాగే తిరునక్షత్ర ఉత్సవం 90 రోజులు ఇంటింటా పారాయణం జరుగుతాయని నర్సంపేట శాఖ బాధ్యులు చెప్పారు.

# కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేసిన బల్దియా కమిషనర్.

**గోడలపై స్వచ్ఛతను చాటి చెప్పేలా చిత్రాలు వేయించండి.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని గోడలపై స్వచ్ఛతను చాటిచెప్పేలా రంగుల చిత్రాలు వేయించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, బర్త్ అండ్ డెత్ విభాగాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్వహిస్తున్న విధుల తీరును అధికారులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భం గా ?బర్త్ ు డెత్ విభాగం ను సందర్శించి జనన, మరణ నమోదు వివరాలను ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణ లోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని షట్టర్ల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడారు. షట్టర్ల ప్రాంతంలోని గోడలపై 'స్వచ్ఛ భారత్' సందేశాలు ప్రచారమయ్యేలా స్వచ్ఛత కు సంబంధించిన చక్కని పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా నిబద్ధతతో విధి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏసీపీ ఖలీల్, సూపరింటెండెంట్ రామకృష్ణతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాశిబుగ్గ శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా.

**సామూహిక సత్యనారాయణ వ్రతాలు**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర నిజ జ్యేష్ఠ గురు పౌర్ణమిలి సందర్భంగా కాకతీయులు నిర్మించినటువంటి ప్రసిద్ధిగాంచిన పురాతనమైన కాశిబుగ్గ

శ్రీ రంగనాయక స్వామి దేవాలయం లో బుధవారం రోజున ఉదయం 6:30 ని.లకు. సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతమును, ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణములతో దేవాలయ చైర్మన్ శ్రీమతి గోసికొండ శకుంతల సుధాకర్, ధర్మకర్తలు నీలం అరుణ శ్రీనివాస్, పల్లకొండ రాజమణి రమేష్, పిట్టల కొటేశ్వర్, మేడికుర్తి లోకేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ కో-కన్వీనర్ ఆకెన వెంకటేశ్వర్లు-వసంత, గుర్రపు ఉషశ్రీ-అశోక్ బాబు, ఆకేన శోభ-రవి దంపతులు కుమ్మరి పూర్ణ, ఓని రజిత, మాదగాని సరోజన, కందికొండ వరలక్ష్మి, సంధ్యారాణి పాల్గొన్నారు. పూజా తదనంతరం భక్తులు తీర్థ, ప్రసాదాలు స్వీకరించడం జరిగినది.సార్ తప్పకుండా రెండు ఫోటోల తో ఐటం వాడండి

# వరంగల్‌కు కమ్యూనిటీ రేడియో లేకపోవడంపై కేంద్రాన్ని ప్రశ్నించిన.

**వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



వరంగల్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రచార కార్యక్రమాల ద్వారా ఎంత మేర ప్రయోజనం చేకూరుతోంది? కమ్యూనిటీ రేడియో కేంద్రాలకు, ప్రజా అవగాహన కార్యక్రమాలకు ఎలాంటి సహాయం అందుతోంది? కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం కోసం వరంగల్‌లో చేపట్టిన చర్యలు ఏమిటి? అనే కీలక అంశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో లేవనెత్తారు.గత మూడు సంవత్సరాల్లో వరంగల్ జిల్లాలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు, మీడియా అవుట్‌రీచ్ కార్యక్రమాలు, ప్రజా చైతన్య ప్రచారాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహాయం, లబ్ధిదారుల వివరాలు, కేంద్ర పథకాల ప్రచారం కోసం చేపట్టిన కార్యక్రమాలపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను ఎంపీ డా.కడియం కావ్య ప్రశ్నించారు.ఈ మేరకు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క కమ్యూనిటీ రేడియో స్టేషన్ కూడా లేదని వెల్లడించారు. అయితే దేశవ్యాప్తంగా కమ్యూనిటీ రేడియో ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, వరంగల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.అలాగే గత మూడు సంవత్సరాల్లో వరంగల్, పరిసర ప్రాంతాల్లో 17 ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించినట్లు కేంద్రం తెలిపింది. యోగా దినోత్సవం, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ఓటరు అవగాహన కార్యక్రమాలు, నషా ముక్త్ భారత్, పోషణ్ మాహ్ తదితర అంశాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించింది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మరింత విస్తృతంగా చేరాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో కమ్యూనిటీ రేడియో వంటి ప్రజా సమాచార వేదికలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. వరంగల్‌కు రావాల్సిన అవకాశాలు, కేంద్ర మద్దతు, సంస్థలను సాధించేందుకు పార్లమెంట్‌లో నిరంతరం ప్రశ్నిస్తాన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించిన ప్రతి అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం, వరంగల్‌కు తగిన ప్రాధాన్యం కల్పించడమే తన లక్ష్యమని ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నాయి.

# 14వ డివిజన్‌లో కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు.

**ప్రజల విశ్వాసానికి నిదర్శనమే కాంగ్రెస్ బలోపేతం.**

**జిల్లా అధ్యక్షుడు అయూబ్.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ సయ్యద్ ఇంతియాజ్ గారి ఆధ్వర్యంలో ఎస్ఆర్ నగర్, బాలాజీనగర్ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం పార్టీల కార్యకర్తలు, నాయకులు, యువకులు, మహిళలు కలిపి సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు సమక్షంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాంగ్రెస్ కుటుంబంలోకి హృదయపూర్వకంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూఎరాష్ట్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, నిరుద్యోగులు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుండటంతో ఇతర రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నిరంతరం పని చేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు.

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ మొహమ్మద్ అయూబ్ గారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలే పార్టీ బలమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లాలో మరింత పెద్ద ఎత్తున ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు కొనసాగనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

14వ డివిజన్ అధ్యక్షుడు శ్రీ సయ్యద్ ఇంతియాజ్ గారు మాట్లాడుతూ, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తామని, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాలను తీసుకెళ్తామని చెప్పారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పార్టీలో చేరిన నాయకులు అంబాల సత్యం, రఫీక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నాయకత్వం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలన తమను ఆకట్టుకుందని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని, కాంగ్రెస్ విజయానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నార.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర రావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య ,ముచ్చర్ల స్టాలిన్, అంబాల సత్యం పసునూరి సరిత పల్లపు రాజేశ్వరి భాగ్య సరూప నరేష్ దామెర లేనిన్ స్టార్ లేదన్న అరవిందు తప్పెట్ల నరసయ్య అబ్బర బోయిన నితిన్ కొంకటి అఖిల్ దామెర అంబేద్కర్ అబ్బర బోయిన పవన్ పల్లపు నరేందర్ ఇనుగాల అరవిందు పల్లపు రాజేశ్వరి అమ్మ రామ సిలుముల సంధ్య ప్రసాద్ గోవిందు సాంబయ్య బానోతు నరేష్ పుట్ట రాకేష్ బండి రజిత పన్నాటి కోమల గోలి అనిత బత్తుల చిరంజీవి పగిండ్ల విజయ్ అంకం రాధమ్మ కుడికాల నిర్మల తో డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళి దేవాలయంలో శాకాంబరి నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు.

**అమ్మవారికి శాకాంబరి అలంకరణ దర్శనం.**

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత పదిహేను రోజులుగా జరుగుతున్న రా కంతా దీక్షా పూర్వక శాకంభరీ నవరాత్రులు నేటితో ముగిశాయి. ఈ రోజు పదిహేనవ రోజు ఆషాఢ శు। పౌర్ణమి రోజున అమ్మవారిని శాకంభరిగాలి అలంకరించి పూజారాధనలు జరిపారు. ఉదయం గం।। 10-00లకు అమ్మవారి దర్శనానికి దేవస్థానం వారు అనుమతించగానే కట్టలు తెంచుకున్న ఆనందంతో గుడిలోపలికి వచ్చి శాకంభరీ అలంకారములో ఉన్న అమ్మవారిని దర్శించుకొని పులకించిపోయారు. దేవస్థానం ప్రాంగణం అంతా భద్రకాళి శరణం మమ, శాకంభరీ శరణం మన అనే నామ స్మరణతో మారుమ్రోగింది. ఆలయ ఈఓ రామల సునీత పోలీసు ప్రభుత్వ శాఖల సమన్వయంతో జరిపిన ఏర్పాట్లు భక్తుల ప్రశంసలకు పాత్రమయ్యాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు సుమారు 4000 కిలోల కూరగాయలు, పండ్లు సేకరించి దండలుగా చేసి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం గం।। 03-00లకు ప్రారంభమైన అమ్మవారి శాకంభరీ అలంకరణ గం।। 9-30వరకు సాగింది. గం।। 10-00లకు పూజానంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి అలంకరణకు కావలసిన కూరగాయలు, పండ్లు నిన్న సాయంకాలం గం।। 06-00ల నుండి భక్తులు నుదిగా గుడికి చేరుకొని అర్చకుల సూచనల స్వీకరిస్తూ దండలుగా చేసి ఇచ్చారు. నిన్న రాత్రి నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కజేయకుండా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వమూర్తి రహస్యంలో 12వ శ్లోకం నుండి 17వ శ్లోకం వరకు ఈ శాకంభరీ ఆరాధనా విశేషం వివరించబడింది. ఈ శాకంభరీ దేవి నీల వర్ణం కలిగి కమరాసనముపై సుందరముగా నుండి తన చేతులయందు వరిమొలకలు, పుష్పములు, ఫలములు, చిగురుటాకులు, దుంపగడ్డలు మొదలగు కూరగాయల నముదాయమును ధరించి ఉండును. ఈ శాక సముదాయములు అంతులేని కోరికలను తీర్చు రనములు గలపై జీవులకు కలుగు అలక దప్పి మృత్యువు, మునలితనము జ్వరము మొదలగు వానిని పోగొట్టును ఉమా, గౌరీ, సతీ, చండీ, కాశికా, పార్వతీ అనే పేర్లతో కూడా ఈ దేవి ప్రసిద్ధి పొందినది. ఈ శాకంభరీ దేవిని భక్తితో ధ్యానం చేయువారు, సమస్కరించువారు, జపించువారు. పూజించువారు తలగిపోని అన్న, పానామృత ఫలములను అతి శీఘ్రముగా పొందుతారని ఈ మూర్తి రహస్యంలో తెలుపబడింది. శాస్త్రాలలో ఈ శాకంభరీ మహాత్మ్యం వివరింపబడి ఉండటం వలన ఈ శాకంభరీ ఆరాధన బహుళ జనాదరణ పొందినది.

శాకంభరీ అంకరణ హన్మకొండ టీచర్స్ కాలనీ వాసి ప్రముఖ పవర్ ఇన్స్టలేషన్స్ కాంట్రాక్టరు డా।। మండువ శేషగిరిరావు-రేణుక దంపతులు హైదరాబాదు వాస్తవ్యులు శ్రీ ఈమని హరికృష్ణ- స్మిత దంపతులు సౌజన్యంతో జరిగింది. పోలీసు శాఖవారు. ఎన్.సి.సి వాలంటర్లు శ్రీ లక్ష్మీవెంకటేశ్వర లక్ష్మి శ్రీనివవాస సేవా సమితి సభ్యులు భక్తులుకు క్యూలైన్లలో సేవరించించారు భద్రకాశ సేవానమితి కన్వీనర్ అయితే గోపీనాథ్ అధ్వర్యనంలో వేలాది మంది భక్తులకు ప్రసాద వితరణ జరిసారు. మరియు ఈ రోజు దేవాలయములో మార్వాడీ మిత్రమండలి ఆధ్వర్యంలో దేవాలయమునకు విచ్చేసిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం శాకంభరీ నవరాత్రుల పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది.శాకంభరీ నవరాత మహోత్సవములు విజయవంతం కావడానికి సహకరించిన ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా పోలీసు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సహకరించిన సకల జనులకు ఆలయ ఈఓ రామల సునీత పేరుపేరున ధన్యవాదములు తెలియజేశారు.

# చేతిలో ఫోన్... కరిగిపోతున్న మానవ సంబంధాలు!"

నీలగిరి వార్త ప్రతినిధి షాద్ నగర్ జులై 29



"నమస్కారం! నేటి సమాజంలో మనం గమనిస్తున్న అతి పెద్ద మార్పుల్లో, లేదా కాస్త ఆందోళన కలిగించే పరిణామాల్లో మొబైల్ ఫోన్ల వాడకం ఒకటి. సాంకేతికత అభివృద్ధి చెందడం, ప్రపంచం అరచేతిలోకి రావడం సంతోషకరమే. కానీ, అదే మొబైల్ ఫోన్ నేడు మనిషిని మనిషికి దూరం చేస్తూ, ఒక కృత్రిమ ప్రపంచంలో బందీ చేస్తోంది.

**1. బంధాలు - బందీఖానాలు:**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు, సాయంత్రం పూట అరుగుల మీద కబుర్లు,

ఇరుగుపొరుగుతో ఆప్యాయ పలకరింపులు ఉండేవి. కానీ నేడు, నలుగురు కూర్చున్న చోట కూడా ఎవరి లోకంలో వాళ్ళు ఉంటున్నారు. పక్కనే కూర్చున్న మనిషితో మాట్లాడే తీరిక లేదు కానీ, వేల మైళ్ల దూరంలో ఎక్కడో ఉన్న ఎవరో వ్యక్తులతో చాటింగ్ చేయడమే లోకమైపోయింది. దీనివల్ల రక్తసంబంధాలు, భావోద్వేగ బంధాలు బలహీనపడుతున్నాయి.లి

**2. యువత భవిష్యత్తుపై ప్రభావం:**

ఇక మన విద్యార్థులు, యువత విషయానికి వస్తే... సోషల్ మీడియా రీల్స్, వీడియో గేమ్స్, గంటల తరబడి చాటింగ్ అనే మాయలో పడి తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇది కేవలం సమయ వృథా మాత్రమే కాదు, వారి ఏకాగ్రతను దెబ్బతీసి, జ్ఞాపకశక్తిని, మానసిక ఉత్సాహాన్ని హరిస్తోంది. రాత్రంతా మొబైల్స్ తో గడపడం వల్ల శారీరక ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది.

3. చిన్న పిల్లలపై దుష్ప్రభావం:ఈరోజుల్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నారనో, అన్నం తినడం లేదనో తల్లిదండ్రులే వారి చేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. దీనివల్ల పిల్లల్లో ఊహాశక్తి తగ్గిపోయి, మొబైల్ వ్యసనపరులుగా (Addicts) మారుతున్నారు. వారి మెదడు ఎదుగుదలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది.

మనమంతా చేయాల్సింది ఏమిటి?

సాంకేతికతను మనం వాడాలి, కానీ అది మనల్ని వాడకూడదు.'డిజిటల్ డిటాక్స్' (ఱఅస్త్రఖ్యుశ్రీ ఱవీశీఃఇ): ఇంట్లో ఉన్నప్పుడు, ముఖ్యంగా భోజనం చేసేటప్పుడు లేదా కుటుంబ సభ్యులతో గడిపే సమయంలో ఫోన్లను పక్కన పెట్టేయండి.జీవితం: సోషల్ మీడియాలోని వర్చువల్ లైఫ్ కన్నా, నిజ జీవితంలో మనుషులతో మాట్లాడటం, ప్రకృతిని ఆస్వాదించడం అలవాటు చేసుకోండి.

పిల్లలకు సమయం కేటాయించండి: పిల్లలకు ఫోన్లు ఇవ్వడానికి బదులు, వారితో ఆటలాడండి, కథలు చెప్పండి.

?ఫోన్ అనేది కేవలం మన అవసరానికి ఒక సాధనం కావాలి తప్ప, మన జీవితాన్ని శాసించే శక్తి కాకూడదు. ఈ మార్పు మన ఇళ్ల నుంచే మొదలుకావాలి. అందరం కలిసి మన బంధాలను, మన సమాజాన్ని కాపాడుకుందాం!"

**నీల రవీందర్**
**సామజిక కార్యకర్త**
**షాద్ నగర్**

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ బిఆర్ఎస్ కౌన్సిలర్లు

**తాండూరు, జూలై 29 :**



మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని తాండూరు మున్సిపల్ బిఆర్ఎస్ కౌన్సిలర్లు కలిశారు. బుధవారం హైదరాబాద్ లోని నివాసంలో పైలెట్ రోహిత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పట్లోళ్ల దీప నర్సింలు,ఇర్షాద్, లక్ష్మి, సంతోష్ గౌడ్, అనంత్ రెడ్డి, అనిల్, యోగానంద్, తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ రెడ్డి ని కలిసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు

## శ్రీ చైతన్య ఆదిభట్ల లో విద్యార్థి ప్రతినిధుల ప్రమాణస్వీకారం

**హైదరాబాద్ నీలగిరి వార్త (జూలై29):**



స్థానిక శ్రీ చైతన్య పాఠశాల ఆదిభట్ల లో బుధవారం విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం(ఇన్వెస్టిచర్) సాంప్రదాయ బద్ధంగా నిర్వహించా రని దిల్సుక్నగర్ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏ .జి .ఎం మన్నే వెంకటరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాలీబాల్ నేషనల్ ప్లేయర్ వాలీబాల్ శ్రీనివాస్ విద్యార్థి ప్రతినిధులుగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ తో పాటు వివిధ విభాగాల ప్రతినిధులకు బ్యాడ్జిలను అందజేశారు ఈ సందర్భంగా నూతన స్టూడెంట్ క్యాబినెట్ సభ్యులను అభినందించి నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యవహార శైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఎ.జి.ఎం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గురు పౌర్ణిమ గుర్తు చేస్తూ గురువులకి శిష్యులకి ఉన్న ఆత్మీయతను తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తూ ఆదర్శవంతమైన నాయకులుగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరూ విద్యాభ్యాసం పై ప్రత్యేక శ్రద్ధను కనబరచడం తో పాటు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ,పెద్దలను గౌరవించాలని ఉన్నత విలువలను పాటిస్తూ బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ .ఐ. రవీందర్ రెడ్డి .కో ఆర్డినేటర్స్ పుల్లారావు, రవికుమార్. ప్రిన్సిపల్స్ సతీష్ ,హుస్సేన్. వైస్ ప్రిన్సిపల్ వాహిని ,చంద్రశేఖర్ ఏ.వో వెంకటేశం గౌడ్ ,ఇస్మాయిల్ .డీన్స్ మహిపాల్ రెడ్డి ,సాయికుమార్, ఇన్చార్జిలు, పి .ఈ .టి లు,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఒక్క ఇంటికి ఒక్క మొక్క పచ్చని గ్రామమే మన లక్ష్యం

**ఆర్కతల గ్రామంలో సుమారు 400 మొక్కల పంపిణీ చేసిన పిఎసిఎస్ చైర్మన్. పోలీస్ రామ్ రెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్న నాయకులు గంజాయి రాములు**

**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం**





నవాబుపేట మండల కేంద్రంలోని ఆర్క తల గ్రామంలో. పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. గ్రామ ప్రజలకు జామ కరివేపాకు, గోరింటాకు,గులాబీ చామంతి, తదితర మొక్కలను పంపిణీ చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నవాబు పేట్ మండలం ఆర్కేతల గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కలు నాటి సంరక్షించాలని మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమర్తిల్లేతను కాపాడవచ్చు అని తెలిపారు భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఇంటి వద్ద మొక్కలు పెంచడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజాయి రాములు పాల్గొని గ్రామ ప్రజలకు మొక్కల ప్రాధాన్యతను వివరించారు గ్రామ ప్రజలు యువకులు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను స్వీకరించి వాటిని సంరక్షిస్తామని హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు పిలుపుమేరకు గ్రామంలో ఆర్కతల గ్రామ యూత్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

అర్కతల యూత్ కమిటీ అధ్యక్షులుగా కుమ్మరి రమేష్ ఎన్నిక. 21 నుండి 29 సంవత్సరాల యువకులతో గ్రామంలో యూత్ కమిటీ ఎన్నికలు ఫలితంగా నిర్వహించారు.గ్రామ యువత ఏకగ్రీవ నిర్ణయంతో కుమ్మరి రమేష్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుమ్మరి రమేష్ మాట్లాడుతూ గ్రామ యువతను ఐక్యంగా తీసుకువెళ్లి సామాజిక సేవ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ క్రీడలు విద్య అవగాహన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. గ్రామ అభివృద్ధి యువత కీలకపాత్ర పోషించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో. ఉప సర్పంచ్. శివ నీల బాగయ్య పి ఎస్ సి ఎస్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమ్మరి అంజయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ గంజాయి జనార్ధన్, వార్డ్ సభ్యులు వడ్డే వెంకటయ్య, కావలి అంజయ్య, మేనేపల్లి శ్రీశైలం, గంజాయి, కొత్తగాడి మాణిక్యం, మాలీష్ రామచందర్ రెడ్డి గొల్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు

## మియాపూర్ డివిజన్ ప్రశాంత్ నగర్ లో అక్రమ చర్చి నిర్మాణం పై అధికారుల కి ఫిర్యాదు..

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త..**



మియాపూర్ ప్రశాంత్ నగర్ ప్రాంగణం లోని సర్వే నెంబర్ 100లో అక్రమంగా చర్చ్ నిర్మిస్తున్నారని తెలిసి కొన్న స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్తలు వెంటనే స్పందించారు. ప్రజలు నివసించే ఇళ్ళ మధ్య చర్చిలు నిర్మించి మైకులు పెట్టి సౌండ్ పొల్యూషన్ కి దారి తీస్తుందని కాబట్టి మన్నె సోను, కూకట్‌పల్లి విశ్వకర్మ జిల్లా విద్యార్థి ప్రముఖ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు మన్యం (బి జె వై ఎం) ,శ్రీను, కృష్ణ, భార్గవ్, సింహ, నవీన్ లు ప్రశాంత్ నగర్ లో అక్రమంగా నిర్మిస్తున్న చర్చ్ పై మియాపూర్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ ఆఫీస్,హెచ్ ఎం డి ఏ ,మరియు ఎమ్మార్వో ఆఫీస్‌లలో ఫిర్యాదు చేశారు.దీనిపై ఎమ్మార్వో స్పందించి, తక్షణమే ఇన్స్పెక్షన్‌కు పంపిస్తామని, విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో వైభవంగా పుష్పార్చన

–

**పూజలో పాల్గొన్న తాండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి**

**తాండూరు, జూలై 29**



శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో వైభవంగా పుష్పార్చన కొనసాగింది. గురుపౌర్ణమి సందర్భంగా కోకట్ రోడ్డులోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పుష్పార్చన మహోత్సవం నిర్వహించారు. భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి పూజలు నిర్వహించారు. పూజలో తాండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయిబాబాకు వివిధ రకాల సుగంధ పుష్పాలతో భక్తిశ్రద్ధలతో అర్చన చేశారు. అనంతరం వేద పండితులు చైర్‌పర్సన్ ని ఆశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సాయినాథుని దివ్య ఆశీస్సులు మన తాండూర్ పట్టణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు" తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్ రెడ్డి, శెంకర్ యాదవ్, బంటు మల్లప్ప, వేణుగోపాల్ రెడ్డి, హన్మయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని సాయిబాబా వారి కృపకు పాత్రులయ్యారు.సాయిబాబా పూజలో మున్సిపల్ ఛైర్పర్సన్ నైవేద్యంతోపులాభిషేకంలో మున్సిపల్ ఛైర్పర్సన్

## ఎమ్మార్పీఎస్ మండల కమిటీల పునర్నిర్మాణం

### మాదిగల సమగ్ర అభివృద్ధే లక్ష్యం: జానకిరామ్ చౌదరి

**గట్టుప్పల్ నీలగిరి వార్తా ప్రతినిధి,, జూలై 29:**



మత దురహంకారం, కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని మండల ఇన్‌చార్జి జానకిరామ్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీల పునర్నిర్మాణ సమావేశం నిర్వహించారు.

?ఈ సందర్భంగా జానకిరామ్ చౌదరి మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించిన అనంతరం మాదిగల పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం సాధనే తదుపరి లక్ష్యమని చెప్పారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో భవిష్యత్ పోరాటాలు మరింత ఉధృతంగా కొనసాగుతాయని, అందుకు మాదిగలు ఐక్యంగా నిలిచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

?అనంతరం మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా భీమనపల్లి శంకర్, అధికార ప్రతినిధిగా ఖమ్మం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మొద్దు గణేష్ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా తలారి సాయిలు, జిల్లా కమిటీ సభ్యుడిగా బరిగెల లింగయ్యను ఎంపిక చేశారు. మండల కమిటీ సభ్యులుగా కట్ట కృష్ణ, బొట్ట శ్రీనివాస్, భీమనపల్లి నరసింహరాజు, దుబ్బాక మల్లేష్, ఖమ్మం శ్రీనివాస్, కొమిరె శ్రీనివాస్, భీమనపల్లి అచ్చయ్య తదితరులను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కొమిరె స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# దేవరకొండకు చేరిన శ్రీరామ హృదయం కలశం

**దేవరకొండ నీలగిరి వార్త**



శ్రీరామ హృదయం కలశం తెలంగాణలోని ప్రతి వ్యక్తికి శాంతి సహనం ఓర్పు ప్రేమ జాలీ దయాదైవత్వాన్ని కలిగించే విధంగా ప్రముఖ చిన్న జీయర్ స్వామి సంకల్పంతో రాబోతున్నటువంటి దీపావళికి శ్రీరామ హృదయమనే నామకరణతో తెలంగాణ వ్యాప్తంగా శ్రీరామ హృదయ కలశం బయలుదేరిందని నలగొండ పట్టణానికి చెందిన రామాలయ మాజీ చైర్పర్సన్ చెకిలం సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక కోదండ రామాలయానికి శ్రీరామ హృదయ కలశాన్ని తీసుకువచ్చి రామాలయంలో భక్తులచే ప్రత్యేక పూజలు నిర్వహించి కలశంలో మహిళలచే పిడికెడు బియ్యాన్ని పోశారు అనంతరం శ్రీ గరుడాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని చేరుకున్నారు ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షులు మహిళలను స్వాగతిస్తూ వెంకటేశ్వర స్వామి పూజా కార్యక్రమం నిర్వహించారు సమాజంలో నేడు హింస పెచ్చు మీరిపోతున్నాయని హత్యలు ఆత్మహత్యలతో అడుగడుగునా శనికావేశంలో హత్యలకు పాల్పడుతున్నారని ఈ వైశ్యామ్యాలను పెచ్చి మీరు పోతున్న సందర్భంలో అధర్మాన్ని అనిచి వేయడానికి శాంతిని నెలకొల్పడానికి చినజీయర్ స్వామి వారి శ్రీరామ హృదయం అనే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కళాశాలు మండలాలకు చేరుకుంటాయని మండలాలలోని గ్రామాలలో దేవాలయాలలో కలశాన్ని ఏర్పాటు చేసి కలెక్షన్లు పిడికెడు బియ్యాన్ని అందించాలని తదనంతరం1008 కలశాలు దీపావళి రోజున కలశాలను చేర్చి అభిషేకం చేయనున్నట్లు తెలిపారు గ్రామ గ్రామాన ప్రతి దేవాలయానికి చేరుకుంటుందని దేవాలయాన్ని చేరుకున్న కలశాన్ని తాకి మీయొక్క మనోవాంఛ కోరికలు తలుచుకొని తల్లిదండ్రులను తలించుకొని తలుచుకొని కలశంలో గుప్పెడు బియ్యం వేయాలని తెలిపారు. ఈ దేవరకొండ నియోజకవర్గం కన్వీనర్ గా దేవరకొండ మున్సిపల్ చైర్ పర్సన్ పున్నమి శైలజా వెంకటేశ్వర్లు చీదెళ్ళ శ్రీదేవి నియమించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గరుడాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, ప్రధాన కార్యదర్శి దొడ్డి అశోక్, కోశాధికారి సిరందాసు కృష్ణయ్య, బెజవాడ నరేందర్, కర్నాటి పురుషోత్తం, ఏ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి వేడుకలు

**దేవరకొండ నీలగిరి వార్త**

గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా గురు సంతు రవిదాస్ కార్యక్రమాల దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ చిత్రం ఉదయ్ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.అనంతరం నిర్వహించిన సభలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ అంకురి నరసింహ మాట్లాడుతూ, గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన మహనీయులని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించాలని ఆయన బోధించిన సందేశాలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్ యాదవ్ బిజెపి జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ గుండాల అంజయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బిక్షపతి మండల అధ్యక్షులు నాగిళ్ల ఆంజనేయులురెడ్డి శంకర్ చండీశ్వర్ కొమ్ము వెంకటయ్య నాగిల్ల సైదులు నేతాల వెంకటేష్ యాదవ్ కాసుల శంకరయ్య వారి శేఖర్ దేవరకొండ టౌన్ జనరల్ సెక్రటరీలు సముద్రాల సహదేవ్ బిక్కు రాపోలు శీను గారు దసరత్ నాయక్ కాటమోని బన్నీ తదితర ముఖ్య కార్యకర్తలు . భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ కి ఘన నివాళులర్పించారు.

## మైనంపల్లి గ్రామపంచాయతీలో జలసిరిపై సమావేశం



**దేవరకొండ నీలగిరి వార్త**

జల సిరుల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వర్షపు నీరుని వడిసిపట్టి నీటిని పొదుపుగా వాడుకోవాలని జలసిరిలో అవగాహన కల్పించనున్నట్లు మైనంపల్లి సర్పంచ్ కోర్ర రామ్ సింగ్ అన్నారు.

మైనంపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ రాంసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ జలసిరి కార్యక్రమంపై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ జలసిరి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి నీటిని పొదుపుగా వాడుకోవాలి. అదేవిధంగా ప్రతి నీటి చుక్కను భూమి లోనికే వెళ్లే విదంగా చర్యలు చెపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ నాయక్.పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్. వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్. సంతోష వెంకట్. సునీత బద్దు నాయక్.కొర్ర కిషన్ నాయక్.పులిజలా నాగరాజు. గ్రామస్తులు గణేష్. లచ్చు. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమం



**దేవరకొండ క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ జూలై 29**

దేవరకొండ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కుంచకూరి అనిల్ మల్లికల కుమారుడు కుంచకూరి భరత్ నందన్ మొదటి జన్మదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో మీల్స్ అండ్ వీల్స్ ( అల్పాహార) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గుద్దేటి జంగయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు కుటుంబ సభ్యుల జన్మదినలు పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదవారి కి సహాయం అందించడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు కుంచకూరి అనిల్ మల్లిక, ప్రధాన కార్యదర్శి కే రవీందర్ రెడ్డి, కోశాధికారి సిహెచ్ కాశీనాథ్, జెడ్ సి గాజుల ఉషారాణి, గాజుల రాజేష్, ఏ వెంకటేశ్వరరావు, ఎల్ మల్లయ్య, దినేష్, కే పురుషోత్తం, ఎన్. సత్యనారాయణ, ఎన్ బలరాం యాదవ్, హరి, మునిని అంజన్ తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా సోమిరెడ్డి ప్రభుత్వ పాదమిక పాఠశాలలో.

ప్రముఖ కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్. నరేష్ విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.



బుధవారం సోమిడి గ్రామశీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ కీళ్ళ వైద్య నిపుణులు డా:నరేష్ నోటుబుక్స్ డొనేట్ చేయడం జరిగిందని పాఠశాల అధ్యాపకులు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు తో సహ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నోట్ బుక్స్ వితరణ చేసిన డా. నరేష్ ని ప్రశంసిస్తూ వారికి అభినందనలు తెలియ చేశారు.

## గురు పౌర్ణమి సందర్భంగా 43వ డివిజన్లోని సాయి నగర్ కాలనీ లోని.

అభయాంజనేయ స్వామి దేవాలయంలో సాయిబాబా అభిషేక వేడుకల్లో పాల్గొన్న.
రంగసాయిపేట డెవలప్మెంట్ సొసైటీ కాలనీల అధ్యక్షుడు కర్నే రవీందర్.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా 43వ డివిజన్లో సాయి నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో కొండపాక రామ్మూర్తి ఆధ్వర్యంలో సాయిబాబా కు అభిషేకాలు అర్చనలు మహానుభారం ప్రసాదములు నిర్వహించినారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగసాయిపేట డెవలప్మెంట్ సొసైటీ కాలనీల అధ్యక్షుడు కర్నే రవీందర్ ప్రత్యేక పూజలు చేసినారు అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో హాలో సాయి నగర్ కాలనీవాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కృపకు పాత్రులు అయ్యారు.

## ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు ను కాపాడుకోవాలి.



వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, ఖిలా వరంగల్ మండల తాసిల్దార్ మమ్మద్ ఇక్బాల్.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ మంత్రి కొండా సురేఖ మాజీ ఎమ్మెల్సీ కొండా మురలీధర్ రావు ఆదేశాల మేరకు 42 వ డివిజన్ లోని పద్మశాలి భవన్ లో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం కొనసాగుతున్న తీరును వరంగల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ వరంగల్ మండల తహసిల్దార్ మమ్మద్ ఇక్బాల్ పర్యవేక్షించారు. అనంతరం వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు హక్కు ఎంతో విలువైనది. దీనిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి భాధ్యత. భారత ఎన్నికల సంఘుశీ ప్రవేశపెట్టిన "ప్రతేక ఓటరు సమగ్ర సవరణ" కార్యక్రమంలో అందరూ పాల్గొని తమ ఓటు కోల్పోకుండా ఏనుమరేషన్ ఫారాలు వ్రాసి ఇవ్వాలని. కొత్తగా ఓటు హక్కు పొందేవారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, పేర్లు మార్చుకోనుటకు, చిరునామా మార్చుకొనుటకు, తప్పులు సవరించుకొనుటకు అవకాశం ఉందని. డివిజన్ లోని ప్రతిఒక్క కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు నాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొని బి. ఎల్.ఓ లకు సహకరించాలని ఓటర్ల నుండి ఎనుమరేషన్ ఫారాలు తప్పకుండా సమర్పించే విధంగా చూసుకోవాలని అని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు రెవెన్యూ ఆఫీసర్లు బి ఎల్ ఎ లు తదితరులు పాల్గొన్నారు.

## సాయి సేవా దళ్ ఆధ్వర్యంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

సాయి సేవా దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్లమ్మ బజారు లోని సాయి సేవాదళ్ భజన మందిరం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలుభక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయిబాబాకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, గంధం, పన్నీరు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు మరియు పుష్పాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఓం సాయి. జయ జయ సాయి ఏకనామ యజ్ఞం ఘనంగా నిర్వహించారు.గురు పౌర్ణమి వేళ పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోసం సాయి సేవా దళ్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా ఆశీస్సులు పొందారు.సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన పల్లకిలో ఉంచి నగరంలోని ప్రధాన వీధుల గుండా భక్తి గీతాలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి " నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

# ఎల్నినోపై రైతులు ఆందోళన చెందవద్దు -- శాస్త్రీయ సూచనలు పాటించి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి:

## పీజేటీయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ( పి జె టి ఏయు) ఆధ్వర్యంలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ( టి ఆర్ వి కె), వికారాబాద్, వ్యవసాయ. ఉద్యాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నవాబ్‌పేట్ రైతు వేదికలో "ఎల్‌నినో ప్రభావం -- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక (కంటినజెన్సీ క్రాప్ ప్లానింగ్ ) మరియు విత్తన మేళా" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం.ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గోపాల కృష్ణమూర్తి, పిజె టిఏయూ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి కవిత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ సత్తార్, సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశం, మండల వ్యవసాయ అధికారి.జ్యోతి, ఉద్యాన విస్తరణ అధికారి శ్రీమతి హర్షిత రెడ్డి, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఎఫ్‌పీఓలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమానికి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ( టి ఆర్ వి కె), వికారాబాద్ సమన్వయకర్త డా. టి. రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించి అతిథులకు స్వాగతం పలికారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, శాస్త్రీయ సాగు విధానాలు, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్రీమతి జ్యోతి నవాబ్‌పేట్‌మండల వ్యవసాయ పరిస్థితులు, పంటల విస్తీర్ణం, వర్షపాతం పరిస్థితులు, శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ వెంకటేశం వ్యవసాయ శాఖ డివిజన్ స్థాయిలో అమలు చేస్తున్న ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నాణ్యమైన విత్తనాల పంపిణీ, రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలను వివరించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి కవిత వికారాబాద్ జిల్లా వ్యవసాయ పరిస్థితులు, వర్షపాతం, పంటల విస్తీర్ణం, విత్తనాల లభ్యత, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖ చేపడుతున్న చర్యలను రైతులకు వివరించి, విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ సిఫార్సులను పాటించాలని సూచించారు.జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీ సత్తార్ తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే కూరగాయలు, పండ్ల తోటలు, పూల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించారు.ఈ సందర్భంగా డా. టి. రాజేశ్వర్ రెడ్డి పత్తి, కంది, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయల పంటలకు సంబంధించి ఎల్‌నినో పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, తేమ సంరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, సమగ్ర పురుగు--వ్యాధి నిర్వహణ, నీటి పొదుపు చర్యలు, శాస్త్రీయ సాగు పద్ధతులపై సవివరంగా వివరించారు.ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలున్నప్పటికీ రైతులు ఆందోళన చెందవద్దని, పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. భూగర్భ జలాలను, నేలలో తేమను సంరక్షించుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.పంటల వైవిధ్యీకరణ ( క్రాఫ్ డైవర్సిఫికేషన్ ) చేపట్టాలని, కూరగాయల సాగు, పూల సాగు, సమీకృత వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం ద్వారా పోషక పదార్థాల వినియోగ సామర్థ్యం పెరిగి, ఎరువుల వృథా తగ్గి, దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. రైతులు వీటిని పిజె టిఏయూ.వ్యవసాయ శాఖ సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు.వ్యవసాయ ఉత్పత్తులకు విలువ ఆధారిత ఉత్పత్తులు (వేల్యూ అడిషన్ ) తయారు చేయడం, ప్రాసెసింగ్, బ్రాండింగ్, ప్రత్యక్ష మార్కెటింగ్‌పై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ( ఎఫ్ బి ఓ లు), స్వయం సహాయక సంఘాలు ( ఎస్ హెచ్ జి లు) బలోపేతం కావాలని, యువత వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లు స్థాపించాలని పిలుపునిచ్చారు. కొడంగల్--వికారాబాద్ ప్రాంతాన్ని అగ్రి స్టార్టప్ అగ్రిబిజినెస్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయం పనిచేస్తోందని తెలిపారు.అనంతరం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విత్తన మేళా ప్రదర్శన స్టాల్స్ను సందర్శించి నాణ్యమైన విత్తనాలు,

వ్యవసాయ సాంకేతికతలు, ఉద్యాన పంటల ప్రదర్శనలను పరిశీలించి రైతులతో ముచ్చటించారు.తదుపరి ప్రగతిశీల రైతు జైపాల్ రెడ్డి సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నందుకు అభినందించారు. అనుకూల ప్రాంతాల్లో రైతులు ఆయిల్‌పామ్ వంటి అధిక ఆదాయం వచ్చే పంటలను కూడా పరిశీలించాలని సూచించారు.

చివరగా రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలకు శాస్త్రవేత్తలు, అధికారులు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సూచనలను ఆసక్తిగా వినిపించారు.

## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న.

బల్దియా కమిషనర్ టి. వెంకన్న దంపతులు.

వరంగల్ బ్యూరో నీలగిరివార్త.

బుధవారం ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవాలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న. ఆలయ అర్చకులు కమిషనర్ కు శాస్త్రోత్రంగా ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## దత్తాత్రేయ స్వామి కరుణా కటాక్షాల తో సర్వం సుభిక్షంగా ఉండాలి.

**- అన్ని దానాల కన్నా అన్నసమర్పణగొప్పది.**

**- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్.**

తాండూరు,జూలై 29 :



దత్తాత్రేయుని కరుణా కటాక్షాలతో సర్వంసుభిక్షంగా ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా ఘూన్ గాపూర్ లోని త్రివేణి సంగమంలో నది స్నానం ఆచరించి శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రో చ్ఛారణలతో ఆశీర్వదించి మరేన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని మనసారా ఆశీర్వదించి తీర్థ ప్రసాదా లను అందజేస్తూ ఘనంగా సన్మానించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు వర్త్య విఠల్ నాయక్ అన్నసమర్పణ నిర్వహించారు .ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ పౌర్ణమిరోజు చేసిన పూజలు, దానధర్మాలు, జన్మజన్మల పాపాలు తొలగిపోతాయన్నారు. అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అన్ని దానాలకన్నా అన్నసమర్పణ గొప్పదన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు.ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చు కోవాలని సూచించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకో వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ పూజారులు రాజు , భక్తులు, తదితరులు ఉన్నారు.

## ఉమ్మడి మియాపూర్ డివిజన్ సర్ కార్యక్రమం లో పాల్గొన్న బి ఎస్ ఎన్ కిరణ్ యాదవ్..

మియాపూర్ నీలగిరి వార్త ..



బుధవారం రోజు ఉమ్మడి మియాపూర్ డివిజన్ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, బి ఆర్ ఎస్ వి శేర్లింగంపల్లి నియోజకవర్గం నాయకులు రాజు వడ్డెరాజ్ , గంగాధర్ లు పాల్గొని వివిధ ప్రాంతాల్లో సర్ కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా న్యూ కాలనీ, సెయింట్ రీటా స్కూల్, ప్రగతి ఎన్‌క్లేవ్, పలు ప్రాంతాల్లో పర్యటించి, బీఎల్ఓ అధికారులతో కలిసి ఓటర్ల వివరాల పరిశీలన, ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం జరిగింది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

## గురు పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో పులికుంట గుట్ట శ్రీ శిరిడి సాయి బాబా మందిరంలో

పూజలందుకున్న భక్తులు ఆలయ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావు గారి వెంకట్ రెడ్డి

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట్ మండలం



నవాబుపేట్ మండల కేంద్రంలోని ఎల్లకొండ గ్రామ పులిగుంట గుట్ట లో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శనం చేసుకోవడం జరిగిందని ఆలయ చైర్మన్ రావు గారి వెంకట్ రెడ్డి తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా గురు పౌర్ణమి వేడుకలను సాయిబాబా మందిరంలోఎంతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా మందిరానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు మందిరానికి వచ్చిన భక్తులందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో సాయినాధుని నామస్వరాలతో అదేవిధంగా భజన భక్తులతో నిర్వహించే కార్యక్రమాలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయని భక్తులు ప్రజలు తెలిపారు ఈ కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు. పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, ప్రభాకర్,లను గుడి చైర్మన్ రావు గారి వెంకట్ రెడ్డి శాలువాలతో సన్మానించి పూజారులచే ప్రసాదం అందించడం జరిగిందని తెలిపారు.

## భారీ వర్షానికి వ్యక్తి గల్లంతు బాధితులను పరామర్శించిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్..

శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..



కొండాపూర్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ ప్రేమ్ నగర్ బీ బ్లాకు వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు నాలాలో ప్రేమ్ నగర్ వాసి బాలయ్య(70) గల్లంతు అవ్వటం జరిగింది. ఈ విషయం తెలియగానే కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించటం జరిగింది. స్థానికులను, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా, ఎన్ డి ఆర్ ఎఫ్, సి ఎం సి ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులను కోరారు. బాలయ్య కుటుంబసభ్యులను హమీద్ పటేల్ పరామర్శించి, ధైర్యంగా ఉండాలని, ఎమ్మెల్యే గాంధీ తో కలసి మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం లో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ కొండ శ్రీకాంత్ గుప్తా

హయత్ నగర్ నీలగిరి వార్త (జూలై 29):



గురువారం గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం లో వైభవంగా పుష్పార్చన నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా రామకృష్ణ నగర్ హయత్ నగర్ బస్సు డిపో వెనకాల కుమ్మరి కుంట సమీపంలోని శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు పుష్పార్చన మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీకాంత్ గుప్తా మాట్లాడుతూ పవిత్రమైన గురు పౌర్ణమి రోజున ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ద్వారా భక్తులందరికీ శుభం కలుగుతుందని ఆయన తెలిపారు. శిరిడి సాయినాధుని ఆశీస్సులు రామకృష్ణ నగర్ కాలనీ ప్రజలందరి పైన ఎల్లప్పుడు ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ కార్తీక్ ప్రధాన అర్చకులు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# లవ్ స్టోరీలు అంటే నాకు పిచ్చి: నాగ చైతన్య




కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన సినిమా ' చెన్నై లవ్ స్టోరీ '. సాయి రాజేష్, ఎస్కేఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. 3 రోజుల్లోనే 40.1 కోట్ల రూపాయలు రాబట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో గ్రాండ్ సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనికి అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగచైతన్య మాట్లాడుతూ.. "ఈ ఈవెంట్ కు వచ్చినందుకు టీమంతా నాకు థ్యాంక్స్ చెబుతున్నారు. నాకు థ్యాంక్స్ చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సక్సెస్ ను సెలబ్రేట్ చేసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. 'చెన్నై లవ్ స్టోరీ' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు రమ్మని సాయి రాజేష్ కాల్ చేశాడు. నేను వేరే కమిట్మెంట్ వల్ల వెళ్లలేకపోయాను. అప్పుడు చాలా బాధపడ్డాను. ఈ సినిమా సక్సెస్ అయ్యాక కాదు, సక్సెస్ కు ముందే ఈ మూవీని ప్రమోట్ చేయాలని నా మనసులో ఉండేది. ఎందుకంటే నాకు పర్సనల్ గా లవ్ స్టోరీస్ అంటే పిచ్చి. కోవిడ్ తర్వాత లవ్ స్టోరీలు తగ్గిపోతుంటే ఒకానొక సమయంలో నాకు భయమేసింది. లవ్ సినిమాలు చూడటానికి ఆడియన్స్ థియేటర్లకు వెళ్తారా? అని ఆలోచించా. మెల్లిగా ఆ ట్రెండ్ మళ్లీ స్టార్ట్ అయింది. 'చెన్నై లవ్ స్టోరీ'తో ఇండస్ట్రీకి మరో కల్ట్ లవ్ స్టోరీ ఇచ్చారు. నాకు ఎంతో హ్యాపీగా ఉంది" అని అన్నారు.

# 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




# 2:35 గంటల రన్‌టైంతో..

ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. "సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ" అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 'ఆర్ఎక్స్ 100' చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.



# రిజర్వేషన్ పోస్ట్ ఫేక్

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



# పావలా శ్యామల కన్నుమూత

ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు. ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు.



# ఐటెం సాంగ్‌లో కీర్తి సురేశ్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉ ందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి.